
రాక్షసుడూ, దర్జీ



రాక్షసుడూ, దర్జీ




భయం గొలిపే స్మశానంలోకి దర్జీ చేరుకునేసరికి అక్కడ బాగా చీకటిగా ఉంది. స్మశానంలో రాజుకి కొత్త ప్యాంటు కుట్టి ఇస్తే దర్జీకి సంచి నిండా బంగారు నాణాలు లభిస్తాయి.

"ఇక్కడ దెయ్యాలూ, పిశాచాలు ఏమీ లేవే," అని ఆశ్చర్యపోతూ దర్జీ తన పనిలోకి దిగాడు. అతడు ఆ మాటలు అన్నాడో, లేదో భూమి కంపించసాగింది. ఒక పెద్ద తల నేల లోపలి నుంచి బయటకు వస్తోంది.

"నా పెద్ద తలని చూశావా?" రాక్షసుడు అడిగాడు.

"ఆ, చూశాను. కానీ నేను ఈ ప్యాంటు కుట్టాలి," అంటూ దర్జీ వణుకుతూ బదులు ఇచ్చాడు.

ఒక వైపున భయపడుతూనే ఉన్నా తన పనిని పూర్చి చేసిన ఆ దర్జీని పాఠకులు మెచ్చుకుంటారు. పాల్ వేసిన భయంకరమైన రాక్షసుడి బొమ్మలు కూడా వాళ్లకి నచ్చుతాయి.



చాలా రోజుల నాటి సంగతి. ఒక పేద దర్జీని రమ్మని కోట నుంచి పిలుపు వచ్చింది.

“చీకటిపడక ముందే రాజు గారు నిన్ను కలవాలని అనుకుంటున్నారు," దూత చెప్పాడు.


దాంతో దర్జీ హడావిడిగా కోట వైపుకి బయలుదేరాడు.

“నాకు ఒక కొత్త ప్యాంటు కావాలి. దానిని ఈ బట్ట నుంచి కుట్టాలి. ప్యాంటు అందంగానే కాకుండా సౌకర్యవంతంగా కూడా ఉండాలి,“ రాజు చెప్పాడు.

“మీ కోరిక ప్రకారమే కుడతాను, మహారాజా," దర్జీ బదులు ఇచ్చాడు.




"నా మాటలు శ్రద్ధగా విను," మహారాజు అన్నాడు. "రాత్రి వేళ, స్మశానంలో మాత్రమే నా ప్యాంటు కుట్టాలి. అప్పుడే ఆ ప్యాంటు నాకు కలిసి వస్తుందని జ్యోతిష్యుడు చెప్పాడు."




చీకటి పడిన తరవాత స్మశానంలో వింత వింత విషయాలు జరుగుతాయనీ, పిశాచాలు తిరుగతాయనీ అందరూ చెప్పుకుంటారు. అయితే రాజు ఆజ్ఞని కాదనటం ఎలా?


"స్మశానంలోనే మీ ప్యాంటు కుడతాను," ధైర్యం కూడగట్టుకుంటూ దర్జీ అన్నాడు. "అలా చేస్తే నీకు సంచి నిండా బంగారు నాణాలు ఇస్తాను!" మహారాజు చెప్పాడు.

కుట్టే సామగ్రి, ఒక కొవ్వొత్తి తీసుకుని దర్జీ దుకాణం నుంచి బయలుదేరాడు. భయంగా ఉన్నప్పటికీ చీకటి రాత్రిలో బయటకు వెళ్లాడు.



లోయలో నడుస్తుండగా చీకటి మరింత చిక్కబడింది.
చివరికి అతడు జీబురు గీబురుమంటున్న స్మశానానికి
చేరుకున్నాడు.







ఒక సమాధి రాయి మీద కూర్చుని దర్జీ కొవ్వొత్తి వెలిగించాడు. ప్యాంటు కుట్టటం మొదలుపెట్టాడు. సూది వేగంగా కదులుతోంది.

“ఈ స్మశానంలో దెయ్యాలు ఉన్నట్టు లేవు," దర్జీ ఆశ్చర్యపోయాడు. “నా పని త్వరగా పూర్తి చేసుకుంటాను."

అతడు ఆ మాటలు అన్నాడో లేదో అతడికి దగ్గరలోనే భూమి కంపించసాగింది.





ఉన్నట్టుండి ఒక పెద్ద తల భూమి లోంచి బయటకు రావటం దర్జీ చూశాడు.
అయినా అతడు కుట్టటం ఆపలేదు.




రాక్షసుడి పెద్ద తల అంతా నేల లోంచి బయటకు రావటంతో అతడు భయంకరంగా అరిచాడు. “నా పెద్ద తలకాయని చూశావా?"

భయంతో దర్జీ వణికిపోతున్నాడు. “ఆ, చూశాను. అయితే నేను ఈ ప్యాంటుని కుట్టెయ్యాలి," దర్జీ ప్యాంటు కుడుతూనే ఉన్నాడు.





మెల్ల మెల్లగా రాక్షసుడి మెడ భూమి లోంచి బయటకు వచ్చింది. “ఇప్పుడు నా పెద్ద మెడ కనబడుతోందా?" రాక్షసుడు అరిచాడు.




దర్జీకి తన గుండె చప్పుడు వినపడుతోంది. “ఆ, కనపడుతోంది. కానీ, దీనిని నేను కుట్టాలి," అతడు జవాబు ఇచ్చాడు.


ప్యాంటు కుట్టటం మాత్రం అతడు ఆపలేదు.



రాక్షసుడి తల, మెడ పైకి లేస్తూనే ఉన్నాయి. ఇప్పుడు అతడు పెద్ద శిఖరం లాగా ఉన్నాడు. “నా విశాలమైన ఛాతీని చూశావా?" రాక్షసుడు కేక పెట్టాడు.


దర్జీ మోకాళ్లు టకటకమని కొట్టుకుంటున్నాయి. “ఆ, చూశాను. నేను ఈ కొంచెం కుట్టాలి," అని సమాధానం ఇచ్చాడు. అతడు ప్యాంటు కుడుతూనే ఉన్నాడు.






రాక్షసుడు పైకి వస్తూనే ఉన్నాడు. ఇప్పుడు అతడి చేతులను గాలిలో ఊపాడు.

“నా పొడవైన, బలమైన చేతులు చూశావా?“



దర్జీ చేతులు చెమటతో చల్లబడ్డాయి. “ఆ చూశాను. నేను దీనిని పూర్తి చెయ్యాలి," అని పలికాడు.


ఇంకా ఎంతో సమయం లేదని తెలుసుకుని అతడు మెరుపు వేగంతో కుడుతూనే ఉన్నాడు.



రాక్షసుడు ఇంకా పెద్దగా అయ్యి ఒక కాలుని బయటకు లాగాడు. ఆ కాలుని నేల మీద తాటించి, “నా పెద్ద కాలుని చూశావా?" అంటూ బొబ్బరించాడు.

“ఆ, చూశాను. నేను ఇంకా కొంచెమే కుట్టాలి!" దర్జీ చేతులు వేగంగా కదులుతున్నాయి. రాక్షసుడు రెండవ కాలు బయటకు తీసే లోపు ప్యాంటు కుట్టటం దర్జీ పూర్తి చేశాడు.

ప్యాంటుని దర్జీ చేతిలోకి తీసుకుని, కొవ్వొత్తిని ఆర్పేసి, సమాధి మీద నుంచి గెంతి, స్మశానం లోంచి బయటకు పరుగు అందుకున్నాడు.




“ఆగు!" రాక్షసుడు గర్జించాడు. అతడు కాళ్లను నేలమీద తాటించిన ధాటికి ప్రార్థనా మందిరం లోని గంటలు మోగసాగాయి.


అతడు దర్జీని వెంబడించసాగాడు.



దర్జీ లోయలోకి పరిగెత్తాడు. అతడి వెనకే పెద్ద పెద్ద అంగలతో
రాక్షసుడు వస్తున్నాడు.
“ఆగు, నా నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు," అంటూ రాక్షసుడు
కేకపెట్టాడు.



“నేను ఆగనే ఆగను!" దర్జీ అరిచాడు. ప్యాంటుని
గట్టిగా పట్టుకుని అతడు వేగంగా పరిగెత్తాడు.
చివరికి అతడు కోట దగ్గరకు చేరుకున్నాడు.




“తొందరగా తెరవండి. నన్ను లోపలికి రానివ్వండి!" అంటూ దర్జీ అరుస్తూ కోట తలుపుల మీద గట్టిగా బాదాడు.

దర్జీ వెనక్కి తిరిగి చూశాడు. అతడిని పట్టుకోటానికి రాక్షసుడు తన పెద్ద చేతిని చాచాడు.

అంతలోపే తలుపు తెరుచుకుంది, దర్జీ కోట లోపలికి దూరాడు.


ఆ విధంగా రాజుకి అదృష్టం తెచ్చి పెట్టే ప్యాంటు తయారయ్యింది.



దర్జీకి సంచి నిండా బంగారు నాణాలు లభించాయి.



మరి రాక్షసుడి సంగతో...



...ఆ రాత్రి తరవాత ఆ
రాక్షసుడు గురించి ఎవ్వరూ
వినలేదు, చూడలేదు.
అయితే కోట గోడ మీద అతడి
పెద్ద చేతి వేళ్ల ముద్ర ఇప్పటికీ
చూడవచ్చు.

అయిపోయింది